నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శుక్రవారం | 26 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

మంత్రి దామోదర్ సమక్షంలో

- కాంగ్రెస్లో చేరిన జోగిపేట చేనేత సంఘం అధ్యక్షులు అశోక్



నవతెలంగాణ - జోగిపేట

జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ నేత, వర్కల అశోక్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఆందోల్ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌతమ్ రెడ్డి నివాసంలో మంత్రి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శివ శంకర్ గౌడ్, హనుమాన్లు, రవి గౌడ్, గ్రామ నాయకులు కిష్టయ్య, భూమయ్య, ఆంజనేయులు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల సకోర అభియాన్



నవతెలంగాణ-సంగారెడ్డి

స్టూడెంట్స్ ఫర్ డెవలప్మెంట్ అధ్వర్యంలో సకోరా అభియాన్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తార డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, కో కన్వీనర్ సుగుణవతి మాట్లాడుతూ విద్యార్థులు సకోరా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తెలియజేశారు. సకోరా అంటే స్నేహం చేద్దాం, పశుపక్షాదులతో అని అర్థమని అని అన్నారు. వేసవి తాపం నుంచి పశుపక్షాదులను రక్షించుట కొరకు ప్రతి ఒక్కరూ ఆలోచించాలని అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కొరకు ఆలోచించి ప్రకృతిలో మానవుడు చేస్తున్న వికృతిని ఆపాలని అందుకు పరిష్కారం చూయించే దిశగా మనమంతా ఆలోచించాలన్నారు. ఇలాంటి పర్యావరణ మహోద్యమంలో విద్యార్థి, యువత, సమాజం కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఆకాష్ , ఎస్ ఎఫ్ డి జిల్లా కన్వీనర్ దినేష్,రాజు,శశాంక్,అనుష,నిఖిల్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావు రాజీనామాకు రెడీగా ఉండు

- పంద్రాగస్టు లోపే రైతులకు రుణమాఫీ
- సోనియా ఇచ్చిన తెలంగాణ తోనే కేసీఆర్తో సహ కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు
- కార్నర్ మీటింగ్లో బీఆర్ఎస్పై నీలం మధు ఫైర్





నవతెలంగాణ-కౌడిపల్లి

మాజీ మంత్రి హరీష్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు రెడీగా ఉండాలని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి కౌడిపల్లి కూరగాయల మార్కెట్ మార్కెట్ సెంటర్ లో మెదక్ డిసిసి అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, నర్సాపూర్ మహిళ ఇన్చార్జి సుజాత సత్యం, సుహాసినిలతో కలిసి నిర్వహించిన కార్నర్ మీటింగ్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నీలం మధు ముదిరాజ్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోగా రైతుల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ ఏడుపాయల వనదుర్గ దేవత, మెదక్ చర్చి సాక్షిగా ప్రమాణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కచ్చితంగా పంద్రాగస్టు లోపే రైతుల రుణమాఫీ చేయడం జరుగుతుందని, మాజీ మంత్రి హరీష్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని మామ అల్లుళ్ల కొడుకు మాట్లాడుతున్నారని కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్లనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చిందన్న విషయాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. తెలంగాణ ఏర్పాటుతోనే కెసిఆర్ సీఎం అయ్యారని, హరీష్ రావు కేటీఆర్ లకు మంత్రి పదవులు దక్కాయని గుర్తుంచుకోవాలన్నారు. అలాగే కాంగ్రెస్ హయాంలోనే రైతులకు అసైన్డ్ భూములు, ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు కేసీఆర్ దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ప్రగల్భాలు పలికారని, ఆ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ హయాంలోని మెదక్ ప్రాంతం అభివృద్ధి జరిగిందని, ఎంతోమందికి ఉపాధి అవకాశాలు దక్కాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి వెంకటరామిరెడ్డికి ఇప్పుడు ప్రజాసేవ గుర్తుకొస్తుందా?అని ప్రశ్నించారు. తాను అన్ని వర్గాలతో కలిసిపోయే వ్యక్తినని స్పష్టం చేశారు, ఈ పార్లమెంట్ ఎన్నికలలో తనను గెలిపిస్తే ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న ఎస్టీ పోడు భూముల సమస్యలన్నిటికీ పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మాజీ ఎంపీపీ చిలుముల పద్మ నరసింహారెడ్డి, ఎంపిటిసి కాలేరు మంజుల శివాంజనేయులు, పిఎసిఎస్ సొసైటీ వైస్ చైర్మన్ చిన్న, డిసిసిబి డైరెక్టర్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్వారి శ్రీనివాసరావు రాష్ట్ర నాయకులు చిలుముల శేష సాయి రెడ్డి, చిలుమూల నర్సింహారెడ్డి , చిలుముల చిన్నంరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రఘు పటేల్ చంద్రం దుర్గా గౌడ్ తునికి గోపాల్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ రెడ్డి నరహరి కుర్మా షేకులు, మైనార్టీ నాయకులు హైమద్, పామ్ శేఖర్ మాజీ సర్పంచులు వివిధ గ్రామాల ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలి

- రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బీజేపీని ఓడించాలి
- దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్



నవతెలంగాణ-దుబ్బాక

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పని దినాలను 200 రోజులకు పెంచేలా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటూ,ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిధులను తగ్గిస్తున్న బీజేపీని ఓడించాలని కోరారు. మహనీయుల మాసోత్సవాల సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ చేపట్టిన భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమంలో భాగంగా గురువారం దుబ్బాక మండల పరిధిలోని హబ్సిపూర్లో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ సోకకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్,నాయకులు భూమేష్,భూమయ్య పలువురున్నారు.

అడవి పంది దాడిలో ఉపాధి హామీ కూలీకి తీవ్ర గాయాలు

నవతెలంగాణ - కొండపాక

కొండపాక మండలం బందారం గ్రామం అడవి పంది దాడి చేయడంతో ఉపాధి హామీ కూలీకి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. బందారం గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు గ్రామ శివారులో కూలి పనులు చేస్తుండగా అడవి పంది వచ్చి వారిపై దాడి చేసింది. దాంతో గంగుల మంజుల అనే ఉపాధి హామీ కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే అంబులెన్స్ లో సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రముఖులను కలిసిన దేవేందర్ రెడ్డి





నవతెలంగాణ-కొండపాక

ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి రాష్ట్రంలోని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రముఖులను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ దీపదాస్ లను హైదరాబాదులోని వారి నివాసాలలో కలిసి శాలువాతో సత్కరించారు. డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఇటీవలనే బిఆర్ఎస్ వీడి కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ సురేందర్ రావు, కొండపాక మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం ఖాయం

- బిజెపి నాయకులు జస్వంత్ రెడ్డి



నవతెలంగాణ -గజ్వేల్

పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు విజయం ఖాయమని గజ్వేల్ బిజెపి నాయకులు జస్వంత్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ చేసిన అభివృద్ధి పార్లమెంటులో బిజెపిని గెలిపిస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు మాజీ సర్పంచి రామచంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్ రెడ్డి, ఎల్లురామిరెడ్డి, రాములు, మహేందర్, గణేష్, అరవింద్, తదితరులు ఉన్నారు.

కరెంట్ షాక్తో మృతి చెందిన రైతు

నవతెలంగాణ-సదాశివపేట: సదాశివపేట మండలం నాగులపల్లి గ్రామంలో మద్దూంపల్లి అశోక్ అనే రైతు విద్యుత్ షాక్తో మృతి చెందాడు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో తన బోరుబావి వద్ద కరెంటు రావడం లేదని నాగులపల్లి గ్రామ శివారులో గల పెద్ద జోగు బాలయ్య గారి వద్ద పొలంలో గల ట్రాన్స్ఫారం దగ్గరకు అశోక్ వెళ్లి కరెంటు గురించి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు కరెంట్ షాకుకు గురై చనిపోయాడేజ మృ తుడి కుమారుడి మద్దుంపల్లి మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సదాశివపేట సిఐ మహేష్ గౌడ్ తెలిపారు

సమర్థుడైన వెంకట్రామిరెడ్డికి పట్టం కట్టండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అమీన్పూర్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం





నవతెలంగాణ-అమీన్ పూర్

సమర్థుడు, పరిపాలన అనుభవం కలిగిన వెంకట్రామిరెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ నివాసంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మున్సిపల్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ మెదక్ లోకసభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఎంఎల్ఏ జీఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..ఈ నెల 28న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన అమీన్పూర్ మున్సిపల్ మరియు మండల స్థాయి మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నహాక సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వారి అమలులో విఫలం చెందుతున్న తీరును ప్రజలకు వివరించాలని కోరారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, సపాన దేవ్, బాల్ రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

రోజుకో పార్టీ మార్చే అభ్యర్థులను ఓడించండి

- ప్రజా సమస్యలపైన పోరాటం చేసే జహంగీర్ను గెలిపించండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి



నవతెలంగాణ-చేర్యాల

రోజుకో పార్టీ మార్చే అభ్యర్థులను ఓడించి ప్రజా సమస్యలపై పోరాటం చేసే భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి. జహంగీర్ ను గెలిపించాలని హమాలీ కార్మికులకు సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థి ఎండి జహంగీర్ గెలుపును కోరుతూ గురువారం పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో హమాలీ కార్మికులతో గోపాల స్వామి మాట్లాడారు. పార్లమెంటు పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థుల చరిత్రను ఒకసారి ప్రజలు గమనించాలని, ఏ పార్టీలో లాభం ఉంటే ఆ పార్టీలోకి మారుతున్నటువంటి పరిస్థితి బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఏ ఒక్కరికి కూడా తెల్వదని ఇలాంటి వారు ఎన్నికల్లో డబ్బు కుమ్మరించి గెలవాలని చూస్తున్నారని అన్నారు. అనునిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యల పైన, కార్మిక వర్గ సమస్యల పైన నీతి నిజాయితీగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోరాటాలు చేసే చరిత్ర సీపీఐ(ఎం) అభ్యర్థికి ఉందన్నారు. అలాంటి కమ్యూనిస్టు పార్టీ నాయకునికి ఈ ఎన్నికలలో ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, శాఖ కార్యదర్శి ముస్త్యాల ప్రభాకర్, ఇప్పకాయల శోభ, సిఐటియు పట్టణ కన్వీనర్ రాళ్ల బండి భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కన్వీనర్ బోయిని మల్లేశం,మేర్గోజు ప్రవీణ్, కనకవ్వ, కిష్టయ్య, పాక వెంకటేశం, పొన్నం లక్ష్మయ్య, ఆంజనేయులు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనను అంతమొందించడమే సీపీఐ(ఎం) లక్ష్యం



నవతెలంగాణ-చేర్యాల

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే సిపిఎం లక్ష్యమని సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో అన్నారు. సిపిఎం పార్టీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జహంగీర్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం మండలంలోని ముస్త్యాల గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ సిపిఎం శ్రేణులు ఈ ఎన్నికల ప్రచారాన్ని పోరాటంగా మలుచుకొని కలిసి వచ్చే శక్తులను కలుపుకొని ప్రజాదరణతో ఎండి జహంగీర్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు రేపాక కుమార్, శాఖ కార్యదర్శి గుండ్ర రవి ,కొంగరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలసారథి ఎండి జహంగీర్ను గెలిపించాలి

- ఉద్యమాలే ఊపిరిగా సీపీఐ(ఎం)
- భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరేస్తాం
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

ప్రజా పోరాటాల సారథి భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థి ఎండి జహంగీర్ను గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని పోసాన్ పల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ సిపిఎం పార్టీ అభ్యర్థి గత 30 సంవత్సరాలుగా నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమై పనిచేస్తున్నాడన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కాంగ్రెస్ అభ్యర్థులు ఏ నాడు ప్రజల కష్టసుఖాల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయలేదన్నారు. ఆ మూడు పార్టీల అభ్యర్థులు కేవలం డబ్బులు ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలిచి పదవిని అడ్డుపెట్టుకొని వ్యాపారాలు, భూ దందాలు చేస్తారని అలాంటి అభ్యర్థులను ఓడించాలన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో పరిశ్రమలు లేకపోవడంతో యువతకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. బూర్జువ పార్టీల నుంచి ఎన్నికైన ఎంపీలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల కష్టసుఖాలు పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి బూర్జువా పార్టీలు నిలబెట్టిన అభ్యర్థులను ఓడించి ప్రజా సేవకుడు ఉద్యమాలే ఊపిరిగా పనిచేసే జహంగీర్ను గెలిపించి భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగరేసి చరిత్ర సృష్టించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాంసాగర్ తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల నాయకులు బక్కెల్లి బాలకిషన్, సత్తయ్య పూస మల్లేశం, పుట్ట బాబు, పిట్ల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేతికందిన మొక్కజొన్న పంట అగ్గి పాలు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని అలిరాజ్ పేట గ్రామంలో గురువారం మొక్కజొన్న పంట అగ్ని కి ఆహుతైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి. చెందిన రైతు పెద్దోల ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం తనకు గల వ్యవసాయ క్షేత్రంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తుండగా పంట పూర్తి కావచ్చింది. కాగా గురువారం నాడు మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు చేతికందిన పంట మంటల్లో కాలిపోయిందని తెలిపారు. కష్టపడి పండించిన పంట మంటకు ఆహుతైంది అని గొడున విలపించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి ఉంటారని అన్నారు. ఎకరం పొలంలో పంట నష్టపోయామని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకున్నారు.

పిల్లల వికాసానికి యోగ అద్భుత శాస్త్రం

- ప్రముఖ వైద్యులు డాక్టర్ భాస్కర్



నవతెలంగాణ-సిద్దిపేట

బాల్యంలోనే పిల్లల్లోని సృజనాత్మక శక్తులను వెలిగిస్తే వారు అద్భుత శక్తులుగా మారుతారని, పిల్లల వికాసానికి యోగ అద్భుత శాస్త్రమని ప్రముఖ వైద్యులు డాక్టర్ భాస్కర్ అన్నారు. వ్యాస మహర్షి యోగా కేంద్రంలో గురువారం బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, ప్రాణాయామం, ధ్యానం వైద్యశాస్త్రంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సెలవులను సద్వినియోగపరిచి పిల్లల మానసిక, శారీరక వికాసానికి తోడ్పాటు అందించాలని సూచించారు. చిన్నప్పుడే నేర్చుకున్న నైపుణ్యాలు వారి దృఢత్వానికి దారులు వరుస్తాయన్నారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి , యోగశిక్షకులు తోట సతీష్, సంధ్యలు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి వేసవి సెలవుల్లో ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగ, ధ్యానం, పాటలు, శ్లోకాలు, కథలు, కర్రసాము, నృత్యం, పెయింటింగ్, అబాకాస్ మొదలగు విభిన్న అంశాల్లో అనుభవజ్ఞులచే శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అధ్యక్షులు అంజయ్య, అధ్యక్షులు తోట అశోక్, సిద్దిపేట జిల్లా టీఎన్జీవోల సంఘం ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డిలు మాట్లాడుతూ టీవీ, సెల్ ఫోన్ల నుంచి పిల్లలను రక్షించుకోవడానికి సాహిత్య సాంస్కృతిక, కళ రంగాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పిల్లలకి ఇచ్చే ఎన్నో కానుకల కన్నా శిక్షణా శిబిరాల ద్వారా ఇచ్చే జ్ఞానం గొప్పదని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు గంగపురం శ్రీనివాస్, బసవరాజ్ రాజ్ కుమార్, రవికుమార్, యాదగిరి, అనిల్, విజయలక్ష్మి, సింధూరి, మనీషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బకాయి పడ్డ గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలి

- వేతనాలు ఇవ్వకపోతే మెరుపు సమ్మెకు దిగుతాం : ప్రభుత్వానికి హెచ్చరిక
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవ తెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లాలో గత నాలుగు నెలలకు పైబడి బకాయి పడ్డ గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలని లేకపోతే ఆకస్మిక మెరుపు సమ్మెకు దిగుతామని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికులు నూటికి 99 శాతం దళిత కుటుంబానికి చెందిన నిరుపేదలు పనిచేయడం జరుగుతుందని గ్రామ ప్రజల కోసం జీవితాలు త్యాగం చేస్తూ అనేక రకాల వ్యాధులు వచ్చిన మురికి కాలువలు, గ్రామంలోని చెత్తను, చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగిస్తూ ప్రతి ఇంటి నుండి తడి చెత్త పొడి చెత్తను సేకరిస్తూ పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనేక సందర్భాల్లో కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా, కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అనేక గ్రామాల్లో గుర్తింపు కార్డులు ఈ బీమా సౌకర్యం, సబ్బులు నూనెలు అమలు చేయడం లేదని యూనిఫామ్ ఇవ్వడంలేదని గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని బకాయి పడ్డ వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేనిచో ఎన్నికల సందర్భంగా మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

ఎంపీ బీబీ పాటిల్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు





నవతెలంగాణ-నార్సింగి

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ వాహనం ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారి 44 సంకాపుర్ వద్ద చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం యాదగిరి (36) మండల పరిధిలోని సంకాపూర్ గ్రామంలో తన భార్య పిల్లలతో నివాసం ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం 25 ఏప్రిల్ న కూడా తన ద్విచక్ర వాహనం పై పనికి వెళ్ళాడు. మధ్యాహ్నం దాదాపు 12:45 గం లకు రామాయంపేట నుంచి తన గ్రామమైన సంకాపూరుకు వెళుతున్న క్రమంలో జప్తి శివనూర్ గ్రామ శివారు లో జాతీయ రహదారి పై ఉన్న సంకాపూర్ మలుపు వద్దకు చేరుకోగానే, హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు ప్రయాణిస్తున్న జహీరాబాద్ ఎంపీ, బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీ.బీ పాటిల్ కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ యాదగిరి ని ఢీ కొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో యాదగిరి ఎడమ కాలుకి, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు అవ్వగా అతనికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించారు. యాదగిరి అన్న ఫిర్యాదు మేరకు కారును అజాగ్రత్తగా నడిపిన ఎంపీ డ్రైవర్ జాదవ్ రాజేష్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ వివరించారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుంటాం

- బీఆర్ఎస్ వడ్డేపల్లి గ్రామ అధ్యక్షులు అయ్యగల్ల రవి



నవతెలంగాణ -రాయపోల్

మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని బీఆర్ఎస్ వడ్డేపల్లి గ్రామ అధ్యక్షులు అయ్యగల్ల రవి గురువారం తెలిపారు. వెంకట్రామిరెడ్డి గెలుపొందడం ఖాయమని, ఆయనకు ఉమ్మడి మెదక్ జిల్లాతో 20 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తుందన్నారు. డిసెంబర్ 9 న అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇప్పటి వరకు ఊసే లేదన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏం లేదన్నారు. దళితులు, ముస్లింల మీద దాడులు చేస్తూ మత రాజకీయం చేస్తున్న బిజెపికి చరమగీతం పాడాలన్నారు. 400 సీట్లు గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని అలాంటి బీజేపీ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఎస్సీ ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు



నవతెలంగాణ-దౌల్తాబాద్

రిజర్వేషన్లు రద్దుకు ప్రధాని మోదీ కుట్రచేస్తున్నారని పదేండ్ల బీజేపీ పాలనలో సామాన్య ప్రజానీకానికి నిండాముంచారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్క్లబ్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పడాల రాములు మట్లాడుతూ రిజర్వేషన్లు ఉండాలా? వద్దా అనే దానికి ఈ లోక్ సభ ఎన్నికలు రెఫరెండమన్నారు. బీజేపీ ఒక్క సీటు గెలిచినా రిజర్వేషన్ల హక్కులను కాలరాస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను కొనసాగిస్తామన్నారు.

నూతన తహశీల్దార్‌కు సన్మానం





నవ తెలంగాణ - న్యాల్‌కల్

జిల్లా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత కొన్ని నెలలుగా ఇంచార్జ్ తహసిల్దార్ తో కొనసాగడంతో .... మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ నుండి బదిలీపై న్యాల్‌కల్ మండలానికి వచ్చారు న్యాల్‌కల్ మండల తాసిల్దారుగా భూపాల్ గురువారం తాసిల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు. మండలంలోని అధికారులు ప్రజా ప్రతినిధులు పార్లమెంట్ ఎన్నికలు కట్టుదిట్టంగా పని చేయాలని నూతన తాసిల్దార్ భూపాల్ అన్నారు . ఆయనకు రెవెన్యూ అధికారులు సిబ్బంది స్వాగతం చేసి శాలువాతో సన్మానించారు సన్మానం చేసిన వారిలో డిప్యూటీ తాసిల్దార్ రాజిరెడ్డి , రెవెన్యూ ఆర్ఐ దుర్గయ్య , కంప్యూటర్ ఆపరేటర్ బిక్షపతి , ఖాసిం తదితరులు ఉన్నారు .

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చు



నవతెలంగాణ-సంగారెడ్డి :

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి.తివారి ఐఏఎస్ , వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్ శెట్. ఐ ఆర్ ఎస్, కలెక్టరేట్లో అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు సలహాలు సూచనలపై రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు వీరిని నేరుగా కలవడానికి వీలుగా ప్రత్యేక కార్యాలయాలు కలెక్టరేట్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సంఘం నిబంధనలు అతిక్రమించే వారిపై ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లో అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన వ్యయం ఖర్చు డబ్బుల పంపిణీ మద్యం పంపిణీ తదితర అంశాల ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లో అందుబాటులో ఉండనున్నట్లు వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్ శెట్ తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకులుగా గోపాల్ జి. తివారి ఐఏఎస్ 7995692890, వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్. శెట్ ఐఆర్ఎస్ 7995692887 ఫోన్ నెంబర్ లలో వీరిని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

గేట్లు తెరవండి సారూ..

భేల్ టౌన్షిప్‌లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

గేట్లు తెరవాలని ప్రజల అభ్యర్థన

నవతెలంగాణ - రామచంద్రాపురం

ఎన్నో సంవత్సరాల నుండి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు భేల్ యాజమాన్యం నిర్ణయంతో గేట్లు మూతపడ్డాయి...... తద్వారా అక్కడ రాకపోకలు సాగించే వేలమంది ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. పాఠశాలలకు, ఆసుపత్రికి, కంపెనీకి వెళ్లే వారికి ఈ దారులు మూతపడడంతో కాలయాపనే కాకుండా ఇబ్బందులు తప్పడం లేదు. అశోక్ నగర్ వైపు నుండి హెచ్ఐజి మీదుగా టౌన్షిప్ లోనికి వచ్చే దారిలో మరియు ఓల్డ్ ఎంఐజి నుండి భేల్ టౌన్షిప్ వైపు వెళ్లే మధ్యలో ఉన్న గేట్లు భేల్ యాజమాన్యం భద్రతా నెపంతో ఇటీవల మూసారు. తద్వారా ఈ ప్రాంతాల్లో నుండి నిత్యం ప్రయాణించే వారికి నరకయాతన తప్పడం లేదు. ముఖ్యంగా భేల్ టౌన్షిప్‌లో ఎన్నో పేరుగాంచిన పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు సైకిళ్ల మీద, నడుచుకుంటూ, వివిధ మార్గాలలో పాఠశాలలకు సకాలంలో వెళ్లేందుకు ఈ దారి గుండానే వెళుతుంటారు, భేల్ ఆసుపత్రికి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు మరియు విశ్రాంత ఉద్యోగులు సైతం వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. అలాంటి వారికి హఠాత్తుగా ఆరోగ్యం బాగా లేకపోతే ఈ దారి నుండే వెళ్లాలి. కానీ ఇప్పుడు అది మూసి వేయడంతో ఏదైనా ఎమర్జెన్సీగా వెళ్లాలంటే చుట్టూ కిలోమీటర్లు ప్రయాణం చేసి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తద్వారా సీరియస్‌గా ఉన్న పేషెంట్లకు ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొంది. ఇక భేల్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఇదే దారిలో ప్రయాణం చేస్తుంటారు.గతంలో వారు కేవలం 15 నిమిషాల ముందు డ్యూటీకి బయలుదేరి వెళ్లేవారు. ఇప్పుడు ఈ గేటు మూయడంతో సమయపాలన ఎక్కువ అవుతూ డ్యూటీలకు లేటుగా వెళుతున్నారు. తొందర తొందరగా వాహనాల మీద వెళుతూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. భద్రతా నెపంతో భేల్ యాజమాన్యం ఉపయోగకరంగా ఉండే గేట్లను మూసి వేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. భద్రత కోసం యాజమాన్యం ప్రయత్నాయ ఏర్పాట్లు చేయాలి తప్ప ఇలా అందరికీ ఇబ్బందులు కలిగించే గేట్లను మూసి వేయడం సరైన పద్ధతి కాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందానగర్ నుండి అశోక్ నగర్ వరకు జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులు, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తద్వారా యు టర్న్‌లు దగ్గరగా లేక కిలోమీటర్ల



మేర ప్రయాణం చేసి భేల్ టౌన్షిప్ లోకి ప్రయాణిస్తున్నారు. టౌన్షిప్ లోకి ప్రవేశించిన అనంతరం ఇక్కడ కూడా భేల్ యాజమాన్యం గేట్లను మూసివేయడంతో ప్రజల కష్టాలు అంతా ఇంతా కాదు. ప్రయాణానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. మూసిన గేట్లను మళ్లీ తెరవాలని అటు యాజమాన్యం దృష్టికి మరియు అధికార కార్మిక సంఘం దృష్టికి తీసుకుపోయినప్పటికీ నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా కార్మిక సంఘం నాయకులు అయినా పట్టించుకొని భేల్ యాజమాన్యంను ఒప్పించి ఈ గేట్లను తెరిపించాలని కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ - రామచంద్రాపురం



బీఆర్ఎస్ పార్టీ మెదక్ లోక్ సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్ల మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే జి ఎం ఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని గడపగడపకు వివరించడంతో పాటు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ రెడ్డి, పుష్పా నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, సపాన దేవ్, పార్టీ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, డివిజన్ల అధ్యక్షులు గోవింద్ యాదవ్, పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి పుస్తె మట్టెలు అందజేసిన కౌన్సిలర్ నాగరాజు

నవతెలంగాణ - జోగిపేట



అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 12 వార్డు కు చెందిన పిరగారి భూమమ్మ లింగమయ్యల కూతురు చంద్రిక వివాహం సందర్భముగా 12వ వార్డు కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు పుస్తె మెట్టలు అందజేశారు. గురువారం ఆయన స్వగృహంలో పెళ్లికూతురుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు తోచిన విధంగా వార్డు ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆయన తెలిపారు.

కంకోల్ సంతను పరిశీలించిన గ్రామ ప్రత్యేకాధికారి

నవతెలంగాణ - మునిపల్లి



మండలంలోని కంకోల్ లో ప్రతి గురువారం జరిగే సంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ హరినందన రావు పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పశువులకు తాగునీటి తొట్టిని నిర్మించాలని , సంత కు వచ్చిన వారికి తాగు నీటి సౌకర్యం, టాయిలెట్స్ కట్టించాలని ఆయన అన్నారు. అనంతరం కూరగాయల మార్కెట్ సందర్శించి అక్కడ కూడా సౌకర్యాల కల్పన గురించి చర్చించారు. తై బజార్లో డబ్బులు తీసుకొని రసీదు ఇవ్వడం లేదని తన దృష్టికి వచ్చిందని, అదేవిధంగా సంతలో తీసుకున్న ప్రతి తై బజార్ డబ్బులకు రసీదు ఇవ్వాలని సూచించారు.వారి వెంట పంచాయతీ. కార్యదర్శి సంతోష, కారోబార్ బస్వరాజు ఉన్నారు.

ఈవీఎం కమిషనింగ్ పై శిక్షణ



నవతెలంగాణ -దుబ్బాక : దుబ్బాక పురపాలిక పరిధిలోని ఐటీసీ కార్యాలయంలో గురువారం జిల్లా సహాయ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అధ్యక్షతన ఈవీఎం కమిషనింగ్ పై మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని 253 ఈవీఎం మిషన్లను ఆపరేటింగ్ చేయు విధానం, స్లిప్పుల కౌంటింగ్ పై 18 మంది సెక్టార్ ఆఫీసర్లు,ఎన్నికల సిబ్బంది కి పలు సూచనలు చేయడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.రమేష్ కుమార్,నియోజకవర్గ తహసీల్దారులు నల్ల వెంకటరెడ్డి,గోవర్ధన్,జయంత్,జ్ఞానజ్యోతి,దివ్యశ్రీకాంత్,ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

- ఎస్సై అపూర్వ రెడ్డి

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్



చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక గ్రామంలో జరిగింది . ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చింతమడక గ్రామానికి చెందిన మోత్కు నరసింహులు (38) ముదిరాజ్ కులస్తుల తో కలిసి చింతమడక గ్రామంలో ఉన్న పెద్ద చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లారు. నరసింహులు నీటిలో శ్వాస ఆడక చెరువులో మునిగి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

గుర్తుతెలియని మహిళ మృతి

-ప్రజ్ఞాపూర్ శివారులో ఘటన

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సీఐ బి. సైదా వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజ్ఞాపూర్ ఇండియన్ పెట్రోల్ పంప్ వెనకాల వెంచర్ లో అందాజ వయస్సు 35 నుండి 40 సంవత్సరాల మహిళ మృతి చెందింది మృతి చెంది సుమారు మూడు రోజులు గడుస్తుందని పోలీసులు అంచనా వేశారు. ఎండవేడికి శవం పూర్తిగా కుళ్లిపోయి,శవం పై గుర్తుపట్టడానికి ఎలాంటి ఆనవాలు లేవన్నారు. బాడీ మొత్తం కుళ్ళిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారన్నారు. ఒక ఫుల్ షర్ట్ బ్లూ కలర్ రెడ్ కలర్ సారి వేసుకున్నదన్నారు. మహిళలు ఎవరైనా గుర్తుపట్టి ఉంటే గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని గజ్వేల్ సిఐ బి సైదా కోరారు. మహిళలు చెట్ల పొదల్లో నిద్రించి ఉన్నట్లు అంచనా వేశారు. మృతదేహానికి అక్కడే పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందన్నారు.అనంతరం కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.

నేడు మండల కాంగ్రెస్ కార్నర్ సమావేశం

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంలో నేడు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల కార్నర్ సమావేశం ఏర్పాటుచేసినట్టు మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర రవాణ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని మండలంలోని కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హజరై విజవంతం చేయాలని రత్నాకర్ రెడ్డి తెలిపారు.

ఏకతాటిపై వచ్చి నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించుకుందాం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండల ముదిరాజ్‌లు మెదక్ నియోజకవర్గ బడుగు బలహీన వర్గాలకు చెందిన నీలంమధు ముదిరాజ్‌ను గెలిపించాలని సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. గురువారం కోల అభిరాం ఫంక్షన్ హాల్లో గజ్వేల్ మండలం లోని ముదిరాజ్‌లు సమావేశమై నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా గజ్వేల్ ముదిరాజ్ అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, నీలంమదు యువసేన ఇంచార్జి సుంకరి మహేష్, ఫిషరీస్ డైరెక్టర్ సత్తయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తలారి భిక్షపతిలు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి నీలంమదు ముదిరాజ్‌కు టికెట్ ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. నీలంమదును అత్యధిక మోజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండలం లోని వివిధ గ్రామాల అధ్యక్షులు, గుంటుకు భిక్షపతి, అహ్మదీపూర్ మంద నర్సింలు, మాజీ ఎంపీటీసీ యాదగిరి, సింగాటం రాజు ,రాజశేఖర్, అక్కారం బాల్ రాజు,బెజాగం మహిపాల్, నాగులు,లక్ష్మీ నరసయ్య,దాతర్ పల్లే సత్యనారాయణ, భయ్యారం బాల్ రాజ్ ,బంగ్లవెంకటాపూర్ సామి,ముక్తమసాన్ పల్లె రమేష్, సామి ,శ్రీగిరిపల్లె వెంకట్ ,ప్రెజ్ఞాపూర్ రామకృష్ణ , గజ్వేల్ కేశమైనబాస్కర్,జంగం సుధాకర్, పిట్ల నాగరాజు , కోమటిబండ రమేష్, రంగపేట రమేష్ ,మల్లన్నసాగర్ పల్లగపహడ్ నర్సింలు, కనకయ్య,ఎటిగడ్డకిష్టాపూర్ యాదగిరి ,లింగరాజ్ పల్లే మంద రాజు,ముత్రాజ్ పల్లే సుదర్శన్ ,జంగిటిమల్లేశం ,తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధి నిర్మూలించడానికి కృషి చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లాలో మలేరియా వ్యాధి నిర్మూలించడానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని కలెక్టోరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన వివిధ అనుబంధ శాఖల సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దేశంలో 2027 సంవత్సరం నాటికి నిర్మూలించాలని అని అన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు ప్రణాళిక బద్ధంగా మలేరియా నిర్మూలన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారి వారి సమన్వయం సహకారం అందించాలన్నారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను తగ్గించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో పారిశుద్ధ్యం పాటించి దోమలు పెరుగుదలను నివారించాలన్నారు. ప్రతివారం సాయంత్రం గ్రామాలలో పట్టణాలలో ఫాగింగ్ నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలలో కళాశాలలో మలేరియా వ్యాధిపై అవగాహన తరగతులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గాయత్రి దేవి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మత్స్యశాఖ అధికారి సతీష్, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి, శంకరయ్య, భాగ్యలక్ష్మి, శ్రీరామ్ సుధాకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

ఏడిఏ బిక్షపతి

నవతెలంగాణ - జహీరాబాద్



నాణ్యమైన విత్తనాలను వాడితే అధిక దిగుబడి సాధ్యమని ఏడిఏ బిక్షపతి అన్నారు. గురువారం జహీరాబాద్ మండల పరిధిలోని బాబానగర్ లో జెకె సీడ్స్ ప్రైవేట్ కంపెనీ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుల పొలాలను జహీరాబాద్ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి సందర్శించి పలు సూచనలు సలహాలు అందించారు. జహీరాబాద్ ప్రాంతంలో రాష్ట్రంలోని ఎక్కడాలేని విధంగా వైవిధ్య భరితమైన పంటలు సాగు చేస్తారని అన్నారు. ఈ ప్రాంతంలో జూన్ జూలైలో సోయాబీన్ సాగు చేసి ఆ తర్వాత ఆలుగడ్డ ఆ తర్వాత పుచ్చకాయ ఆ తర్వాత టమాటో మొక్కజొన్న వంటి పంటలు ఒకే సంవత్సరంలో సాగు చేయడం ఈ ప్రాంతాల రైతులకే దక్కుతుందని కొనియాడారు వ్యవసాయ శాఖ తరపున స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రోత్సహించడం సంతోషించదగ్గ విషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, ఆత్మ బిటిఎమ్ చరణ్, రైతులు కష్ణ, జగన్, బాలకృష్ణ, కృష్ణ కాంత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కూల్ ఫార్మసీలో ఉపన్యాసం

నవ తెలంగాణ - పటాన్‌చెరు





అమెరికా, టీవీస్‌లోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ మెడిసిన్ లోని ఫార్మకాలజీ విభాగానికి ప్రొఫెసర్ జోహన్నెస్ డబ్ల్యు.హెల్, డాక్టర్ మేరీ సి.హార్న్ గురువారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఉపన్యాసం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా ఏర్పాటు చేశారు. కాగ్నిటివ్ ఫ్లెక్సిబిలిటీ, సిఎ వి 1.2 యొక్క అడ్రినెర్జిక్ రెగ్యులేషన్' అనే అంశంపై ప్రొఫెసర్ జోహన్నెస్ డబ్ల్యు, హెల్, 'న్యూరోనల్ మెచ్యూరేషన్ లో నైవిధ్య సైకిన్ , కాచెనిన్ ఇంటరాక్టింగ్ ప్రొచీన్, సెక్షన్ జీ2 యొక్క సంభావ్య పాత్ర' అనే అంశంపై డాక్టర్ మేరీ సి.హార్న్ ప్రసంగించారు. తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను స్వాగతం పలికారు. స్కూల్ ఆఫ్ లోని బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ధృవజ్యోతి చౌదరి వందన సమర్పణ చేశారు.

మంత్రిని కలిసిన దళిత జర్నలిస్టుల ఫోరమ్ నేత

నవతెలంగాణ- జోగిపేట



తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా ను గురువారం దళిత జర్నలిస్టుల ఫోరమ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కాషాపోగు జాన్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. దళిత జర్నలిస్టుల ఫోరమ్ గౌరవ అధ్యక్షులుగా మంత్రిని ఉండాలని విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. దళిత జర్నలిస్టుల ఫోరమ్ కమిటిని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు సహాకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు హెల్త్ కార్డులు,డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగత్ ప్రకాశ్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రాజ్ కుమార్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ధనుష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కొడకంచి ఎంపీటీసీ

నవతెలంగాణ - జిన్నారం



జిన్నారం మండల పరిధి లోని కొడకంచి ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు బీఆర్ఎస్ నేత బత్తుల సంతోషి మహేష్ గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ మేరకు ఎంపీటీసీ బత్తుల సంతోషి మహేష్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి వడ్డే కృష్ణ, జిన్నారం ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్ సారథ్యంలో గురువారం కోట శ్రీనివాస్ గౌడ్ ను కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే ప్రజా పాలన సాధ్యమన్నారు. ఎంపీపీ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్, ఎంపీటీసీ జనాభాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డె క్రిష్ణ, నాయకులు నర్సింలు, మహేష్ గౌడ్, అజారుద్దీన్, రవీందర్, సుధాకర్ యాదవ్ బృందం పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

భారతరత్న డా. బిఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో మొగులయ్య గౌతమ్

నవతెలంగాణ - జహీరాబాద్/ న్యాల్‌కల్



అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంబేద్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు మొదలయ్య గౌతం అన్నారు. గురువారం న్యాల్‌కల్ మండలంలోని హుసేల్లి గ్రామంలో విశ్వరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహన్ని అంబేద్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు విగ్రహదాత మొగులయ్య గౌతమ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత అంబేద్కర్ ఆలోచన విధానంతో ఆయన చూపిన బాటలో ముందుకు నడవాలని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు. డి. శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగువర్గల అభివృద్ధి కొరకు కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. విట్టల్.సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు. బి. వైజనాథ్. కె. దశరథ్. బాలరాజ్. అంబేద్కర్ యుజన సంఘం అధ్యక్షులు. బి. మంచేందర్. అంబేద్కర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఆర్. నర్సిములు.ధనరాజ్. గ్రామకార్యదర్శి. నాగభూషణం. గ్రామ అంబేద్కర్ సంఘ నాయకులు. రాములు. శేఖర్. మాజీ సర్పంచ్. నర్సిములు ఇతర కులసంఘల నాయకులు.గ్రామ పెద్దలు.తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ

నవ తెలంగాణ - న్యాల్‌కల్



మే 13 తేదీన జరిగే పార్లమెంటు ఎన్నికలకు మండలంలో ఇప్పటినుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తాసిల్దార్ భూపాల్ అన్నారు. ఓటర్ జాబితాలో నమోదైన ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్పులను ఇంటింటికి తిరిగి బిఎల్వోలు, పంచాయతీ సెక్రెటరీ లు పంపిణీ చేయాలని భూపాల్ తెలిపారు ...

ఎన్నికలపై బిఎల్ఓలతో సమావేశం

మండలంలోని పార్లమెంట్ ఎన్నికల కోసం మండల ఎంపీడీవో కార్యాలయంలో బిఎల్వోలు అంగన్వాడి టీచర్లతో ముఖ్య సమావేశం నిర్వహించారు. న్యాల్‌కల్ తహసిల్దార్ భూపాల్ గురువారం సమావేశంలో మాట్లాడుతూ బిఎల్ఓ లు గ్రామాల్లో నేటి నుంచి ఇంటింటికి తిరిగి ఓటర్ స్లీప్ లు అందజేయాలని లోక్ సభ ఎన్నికలు కట్టుదిట్టంగా నిర్వహించే విధంగా గ్రామాల్లో పోలింగ్ బూత్ ల్లో విద్యుత్ , తాగునీరు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని బిఎల్ఓలకు చెప్పారు మండలంలో 62 పోలింగ్ బూత్‌లు, 48 వేల 160 ఓటర్లు ఉన్నారని తాసిల్దార్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ రాజిరెడ్డి, ఇంచార్జ్ ఎంపీడీవో సురేష్, పంచాయతి సెక్రెటరీ బిఎల్వోలు ఉన్నారు.

వికాసిత్ భారత నిర్మాణమే లక్ష్యం

నవ తెలంగాణ-రాయపోల్

వికాసిత్ భారత నిర్మాణమే లక్ష్యంగా దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోనే సాధ్యమవుతుందని బిజెపి ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు నామసాని స్వామి అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో అగ్ర దేశాల సరసన ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వికసిత్ భారత నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్యారంటీలతో ముందుకు వెళుతున్నారన్నారు.

విద్యార్థులను అభినందించిన గురుకుల కళాశాల ప్రిన్సిపల్

నవ తెలంగాణ-ములుగు

మండలం కేంద్రంలో గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్ లో 37 విద్యార్థులకు 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ సెకండ్ ఇయర్ లో 100 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు, ఎంపీసీ ఫస్ట్ ఇయర్ లో 96.74 శాతం ఉత్తీర్ణులు కాగా, బైపిసి ఫస్ట్ ఇయర్‌లో 100% ఉత్తీర్ణులు అయినందుకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి కల్పన సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కల్పన విద్యార్థులతో మాట్లాడుతూ చిత్తశుద్ధితో చదివి మంచి మార్కులతో ములుగు గురుకుల కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను అభినందించారు. వచ్చే నెల 5 వరకు రీవ్యాల్యుయేషన్, రీవెరిఫికేషన్ దరఖాస్తుకు గడువు ఉందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీపై బీఎల్ఓలకు శిక్షణ



నవతెలంగాణ- దుబ్బాక

త్వరలో జరగబోవు లోక్ సభ ఎన్నికలకు సంబంధించి దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం తహశీల్దార్ నల్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీపై బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఓటర్ స్లిప్పుల పంపిణీపై పలు సూచనలు చేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో డీటీ సందీప్, ఆర్ ఐ నరసింహారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం

నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన నందగారి నర్సయ్య కుటుంబాన్ని గురువారం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రహీమొద్దీన్ పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అన్ని వేళలా బిఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసేవలో బిఆర్ఎస్ ఉంటుందన్నారు. వారితో పాటు సర్పంచ్ల ఫోరం గౌరవ అధ్యక్షుడు కొత్తపాలెం మాజీ మండల అధ్యక్షుడు దార సత్యనారాయణ,గోవిందాపూర్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి గౌడ్, సాగర్ రెడ్డి,భూపాల్,మల్లేష్ తదితరులున్నారు.

శ్రీ మహంకాళి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఏర్పాట్లు

నవ తెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో శ్రీ మహంకాళి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి కావడం జరిగిందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 26వ తేదీ నుండి 29 వ తేది వరకు ప్రతిష్ట ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.26 న యాగశాల ప్రవేశం , స్వస్తి వచనం, 27 న ఆవాహిత దేవతా పూజ, హారతి, ప్రసాద వితరణ, 28 న యంత్ర విగ్రహ ప్రతిష్ట పోచమ్మ, బోనాల ఊరేగింపు, 29 న మహంకాళి బోనాల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు. ఆలయంలో జరిగే ప్రతిష్ట కార్యక్రమాలతో పాటు కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రథోత్సవంలో పీఏసీఎస్ చైర్మన్

నవతెలంగాణ-బెజ్జంకి

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సాల్లో సందర్భంగా గురువారం ఉదయం నిర్వహించిన రథోత్సవంలో పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావు హజరై ప్రత్యేక పూజలు చేశారు.

అమిత్‌షా బహిరంగ సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

నవతెలంగాణ-తొగుట

మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షులు చిక్కుడు చంద్రం అన్నారు. గురువారం సిద్దిపేటలో అమిత్ షా బహిరంగ సభకు మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి రెడ్డి, చైతన్య బాలరాజు, బాల్ రెడ్డి, ముడికే స్వామి, గొడుగు యాదగిరి, మహేష్, గణేష్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వర్గల్ మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షులు టేకులపల్లి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ ఇంచార్జ్ నందన్ గౌడ్, రంగు ప్రదీప్ గౌడ్, బీజేవైయం అధ్యక్షులు రవీందర్ గౌడ్, మహిపాల్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు తరలివెళ్లారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన పరిశీలకులు



నవతెలంగాణ-మెదక్

సాధారణ ఎన్నికలు 2024ఎన్నికల నియమావళిలో భాగంగా గురువారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి, మీడియా సెంటర్‌ను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ బలస్వామితో కలిసి పోలీసు పరిశీలకులు రామేశ్వర్ సింగ్ పరిశీలించారు. జిల్లాలో చెక్ పోస్టుల వద్ద ఏర్పాటుచేసిన సిసి కెమెరాల రికార్డింగ్ పనితీరు ను పరిశీలించారు. సి విజిల్ లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీమ్ పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పేడ్ న్యూస్, పత్రికాప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పనితీరును ఎంసీఎంసి నోడల్ అధికారి రామచందర్ రాజును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సీజ్ అయిన డబ్బు, మద్యం, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

54 మంది అభ్యర్థులు.. 90 నామినేషన్లు

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



నవతెలంగాణ-మెదక్

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి పోటీచేసేందుకు గురువారం చివరి రోజు 23 మంది అభ్యర్థులు 36 నామినేషన్లు దాఖలు చేశారు. మెదక్ కలెక్టరేట్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నామినేషన్లను స్వీకరించారు. ఈనెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు మొత్తం 54 మంది అభ్యర్థులు 90 నామినేషన్లను దాఖలు చేయడం జరిగింది. శుక్రవారం నామినేషన్లను పరిశీలించనున్నారు.

వెంకటరామిరెడ్డి నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నవ తెలంగాణ-హవేలి ఘనపూర్

మెదక్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. గురువారం మండలంలోని మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా మెదక్‌లో బైక్ ర్యాలీ నిర్వహించడానికి హవేలీ ఘనపూర్ మండలం నుంచి కార్యకర్తల నాయకులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి ,జిల్లా ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి మాణిక్య రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ నాయకులు మేకల సాయిలు, మంద శ్రీహరి,సాప సాయిలు, రాజు, రామచంద్ర రెడ్డి, రమేష్, సాయ గౌడ్, లింగం, ఆయా గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్



నవ తెలంగాణ-నర్సాపూర్

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ అధికారులకు సూచించారు. గురువారం నర్సాపూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు ముందుగా ఆయా శాఖలకు చెందిన అధికారులకు వారి శాఖల ద్వారా గ్రామాలకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా కొడుతున్నందున గ్రామాలలో ఉపాధి కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సరిపోవడంలేదని అదనంగా 1000 ప్యాకెట్లు కావాలని ఎంపీడీవో మధులత, డాక్టర్ కోరారు అందుకు డాక్టర్ సానుకూలంగా స్పందించారు. పిఆర్ఏ ఈ స్వామిదాస్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలలో మరమతులు చేయడానికి కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని 45 రోజుల్లో మరమ్మతులు చేయాలని కమిటీలను ఆదేశించడం జరిగిందన్నారు. అనంతరం ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ మాట్లాడుతూ అధికారులు గ్రామాలలో నీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధులత ఆయా గ్రామాల ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉపసర్పంచ్ రమేష్



నవతెలంగాణ- కొల్చారం

మండలంలోని పైతర గ్రామ మాజీ ఉపసర్పంచ్ బీజేపీ నాయకుడు తాటి రమేష్, గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అంచెలంచెలుగా అమలు చేస్తున్న సూపరి పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ అభ్యర్థి నీలం మధు ముదిరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యాదవ రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి అనిల్, మల్లేశం, వీరారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శివకుమార్, కార్తిక్ రాజు, బోయిని మహేందర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

వధువు వివాహానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం



నవ తెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన బోయిని సతీష్ యాదవ్, కూతురు వివాహానికి గురువారం శివంపేట జడ్పీటిసి పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహాయంగా పదివేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు కవిత మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మెదక్ పార్లమెంట్ సీటును మోడీకి కానుకగా ఇద్దాం


బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు



నవతెలగాణ-మెదక్

ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి మెదక్ పార్లమెంట్ సీటును ప్రధాని మోడీకి కానుకగా ఇద్దామని పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణంలో బీజేపీ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ.. భారతదేశం సుభిక్షంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు బీజేపీకి ఓటేయాలన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. దేశ ప్రజల ఆశీస్సులతో మళ్ళీ మూడో సారి బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అందరం కాషాయ జెండా కింద పనిచేస్తున్నామని, జిల్లా ఆఫీస్ వేరు, అసెంబ్లీ ఆఫీస్ వేరుకాదన్నారు. ఈ సందర్భంగా మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన ఇతర పార్టీల నాయకులు రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ, నిజాంపేట జడ్పిటిసి పంజా విజయ్ కుమార్, జిల్లా నాయకులు నందా రెడ్డి, నల్లాల విజయ్, సుభాష్ చంద్రబోస్,ఎక్కల దేవి మధు, కల్కి నాగరాజు,లోకేష్, వడ్ల జనార్ధన్, రంజిత్ రెడ్డి పట్టణ బీజేపీ అధ్యక్షులు నాయిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతా కేసీఆర్ గాలే వీస్తుంది



మెదక్ లో వెంకట్రామిరెడ్డి గెలుపు తథ్యం

నవతెలంగాణ-మర్కుక్ : బీజేపీ, మోడీ గాలి అస్సలు లేదనీ, రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ గాలే వీస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిని మహేష్ అన్నారు. గురువారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. కరెంటు, నీళ్ల సమస్యలు తీర్చారన్నారు. పార్లమెంటులో మన తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించాలనీ, కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోసపు కాంగ్రెస్ ను నమ్మొద్దని ప్రజలను కోరారు. మతతత్వ బీజేపీ కావాలా..? అవినీతి కాంగ్రెస్ కావాలా..? తెలంగాణ ను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ కావాలా..? మెదక్ ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. బిజెపి,కాంగ్రెస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు.

పర్మిషన్ లేకుండా మద్యం అమ్మితే కేసులే

నవతెలంగాణ-అక్కన్నపేట : అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మలిచెరువు తండా గ్రామంలోని గుగులోత్ అలియా అనే వ్యక్తి కిరాణా షాపును గురువారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతి లేకుండా ఉన్నటువంటి 31.330లీటర్ల బీర్ బాటిల్స్, విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో హెూటల్స్, కిరాణా షాపుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మితే తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో, మనుషులు తిరిగే ప్రదేశాల లో కానీ మద్యం తాగడం, జూదం ఆడడం వంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడ కూడదని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడ విక్రయించిన వెంటనే 8712667445, 8712667446, 8712667447 ఈ నెంబర్లకు కాల్ చేయాలన్నారు.

పేదింటి బిడ్డను ఆశీర్వదించండి

మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ- కొల్చారం

పేదింటి బిడ్డను పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించండి కడుపులో పెట్టుకొని చూసుకుంటా అంటూ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం కొల్చారం మండలంలోని దుంపలకుంట చౌరస్తా మీదుగా రంగంపేట సంగాయిపేట్ చిన్నగంపూర్ పోతంశెట్టిపల్లి ఎక్స్ రోడ్ కొల్చారం మీదుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు నీలం మధు ముదిరాజ్‌ను పూలమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి చిన్న వయసులోనే తల్లిదండ్రులను సైతం కోల్పోయి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని రాజకీయంగా సేవచేసేందుకు ముందుకు వస్తున్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం సంతోషకరమన్నారు. ముదిరాజ్ బిడ్డగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ప్రతి ఒక్కరు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, చిలుముల మదన్ రెడ్డి, సోమన్న గారి రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, ఉపాధ్యక్షులు ముత్తంగారి గోవర్ధన్, సీనియర్ నాయకులు దేవన్న గారి శేఖర్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మరలి అనిల్, యాదవ రెడ్డి, వీరారెడ్డి, మాడబోయిన మల్లేశం, శివకుమార్, శేఖర్, భూమయ్య, కార్తిక్ రాజు, ప్రవీణ్, మధుసూదన్ రెడ్డి, బండి మల్లేశం, జనార్దన్ రెడ్డి, బండి రమేష్, గొండ కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కరెంటు కోతలు పెడుతుంది



నవతెలంగాణ-మెదక్

కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కోతలు పెడుతుందని, అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్ చంద్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు హాజరు కాగా, జెడ్పీ ఛైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కరెంట్ కోతలు, రైతు బంధుకు కోతలు పెట్టారన్నారు. ఇందిరాగాంధీ పరిపాలించినప్పుడు జరగని పనులు కేసీఆర్ హయాంలో జరిగాయన్నారు. కేసీఆర్ మెదక్ జిల్లాగా చేసిండు కాబట్టే నామినేషన్ వేసేందుకు రేవంత్ రెడ్డి వచ్చారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెనుక ఉన్నారని, మళ్లీ సీఎంగా కేసీఆర్ ఉంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. బిజెపి చేసిన అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. భారీ మెజారిటీతో వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు.

మెదక్ గడ్డ పై బీఆర్ఎస్ జెండా

-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మెదక్ గడ్డ పైన బీఆర్ఎస్ జెండా ఎగరబోతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎం కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. 20 లక్షల ఎకరాలు పంట ఎండిపోయినట్లు తెలిపారు. కేసీఆర్ నేతృత్వంలో హల్దీ నుంచి నీళ్లు వచ్చి పంటలు బాగ పండినట్లు తెలిపారు. మార్పు మార్పు అన్నారు ఏం మార్పు జరిగిందో చూపించాలన్నారు. ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజలు ఆలోచించాలని, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కి ఓటు వేయాలని కోరారు.

ఎన్నికల బరిలో ఐఏఎస్ అధికారి

-ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల బరిలో ఐఏఎస్ అధికారిగా పనిచేసిన మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం జరిగిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాక ఇప్పటి వరకు మెదక్ పార్లమెంట్ లో టీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారని తెలిపారు. ఒక మాజీ ఐఏఎస్ అధికారి ఎన్నికల బరిలో నిలిచారని, గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకుందాం

నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ- వెల్దుర్తి

మెదక్ లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైందని ఈ రోడ్ షో బట్టి అర్థమవుతుందని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో రోడ్‌షో కార్యక్రమాన్ని కార్యకర్తలతో భారీ ఎత్తున నిర్వహించారు. ముందస్తుగ మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే ఉన్న జుమ్మా మసీదులో మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాసాయిపేట మండల కేంద్రంలో గ్రామ చావడి వద్ద కార్నర్ నిర్వహించి ఓటర్ల తో మాట్లాడారు. అనంతరం బొమ్మరం కొప్పులపల్లి వెల్దుర్తి గ్రామాల్లో డప్పు సప్పుల మధ్య వినూతన నృత్యాలు వాయిద్యాల మధ్య రోడ్ షో నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు గత ప్రభుత్వాల పరిపాలన ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రాన్ని దేశాన్ని దివాలా తీసారన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడారు కేసీఆర్ ప్రభుత్వం నమ్మకద్రోహం అని చెప్పేదొకటి చేసేదొకటి రాత్రి ఒక మాట పగలు ఒక మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతూ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశారన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడారు. బీసీ ముద్దుబిడ్డ నీళ్ల మధును భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు మాట్లాడారు గత 70 ఏళ్ల పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అల్లకల్లోలంగా ఉన్న దేశాన్ని ఒక దారిలో పెట్టి మంచి పరిపాలన అందించిన ఘనత ఒక కాంగ్రెస్ ప్రభుత్వందే అని అన్నారు ఒక మహిళ మెదక్ నుండి ఎంపీగా గెలపొంది దేశానికి ప్రధానమంత్రిగా పంపిన ఘనత మన మెదక్‌కి దక్కిందన్నారు ఇందిరాగాంధీ హయాంలో మన తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలను ఏర్పాట్లను బ్యాంకులను పంచాయతీలను చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేని అన్నారు బడుగు బలహీన వర్గాల బిడ్డను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీ బి ఫామ్ అందజేసి నామినేషన్ వేయించి గెలిపించుకునే బాధ్యత తమపై ఉంచుకొని నన్ను నడిపిస్తుందన్నారు. అందుకు మీ వంతు సహకారంగా మీ అమూల్యమైన ఓటు నాకు వేసి గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నీలం మధు రోడ్‌షోకు నీరాజనం పలికిన జనం



నవతెలంగాణ -వెల్దుర్తి

మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా గురువారం ఉమ్మడి మాసాయిపేట్ మండలం రామంతపూర్, మాసాయిపేట్, బొమ్మరం, కొప్పులపల్లి, నెల్లూరు, వెల్దుర్తి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి ఉద్దేశించి ఎంపీ అభ్యర్థి నీలం మధు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. గత 70 ఏళ్ల పరిపాలన సాగించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మెదక్ పార్లమెంటు నుండి ఇందిరాగాంధీని గెలిపించి యావత్ దేశాన్ని పరిపాలించేందుకు పంపించిన ఘనత మెదక్ ప్రజలదేనన్నారు. ఇందిరాగాంధీ హయాంలోనే తెలంగాణ రాష్ట్రంలో బీహెచ్ఈఎల్, ఓడిఎఫ్, బీడీఎల్, విమానాశ్రయం, గురుకుల పాఠశాలలు, ఐఐటి, త్రిబుల్ ఐటీ, ఎన్నో పరిశ్రమలను నెలకొల్పిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేని అన్నారు. గత పాలకులు వీటన్నిటిని ప్రైవేటుకు తాకట్టు పెట్టిందన్నారు. వాటిని కాపాడుకునేందుకు నన్ను పార్లమెంటు పంపేందుకు మీ అమూల్యమైన ఓటును నాకు వేసి గెలిపించి తెలంగాణ గలాన్ని వినిపించి మన ప్రాంతాన్ని కాపాడుకోవడానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ మహిళా విభాగ ఇన్చార్జి సుజాత సత్యం సువాసిని రెడ్డి, వెల్దుర్తి మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, వెల్దుర్తి మాజీ సర్పంచి భాగ్యమ్మ అంజనేయులు, పార్టీ రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి తలారి మల్లేష్, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ అన్వేష్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

మెదక్ పార్లమెంటు అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి నామినేషన్ వేస్తుండడంతో చేగుంట, నర్సింగ్ మండలాల నుండి బి ఆర్ ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. ఈ ర్యాలీని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మక్క రాజుపేట రోడ్డు ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రారంభించారు. అంతకుముందు గాంధీ చౌరస్తా వద్ద మహాత్మా గాంధీకి పూలమాలవేశారు. కార్యకర్తలు ,ప్రజా ప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు, పలువురు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని, బిజెపి దుబ్బాక నియోజకవర్గం లో పతనం అవుతుందని, వెంకట్రాం రెడ్డి కలెక్టర్‌గా ఎన్నో సేవలందించారని, ప్రస్తుతం పార్లమెంటు అభ్యర్థిగా తను పోటీ చేస్తున్నారని భారీ మెజారిటీతో గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి, నార్సింగ్ మండల అధ్యక్షులు మైలారం బాబు, జడ్పీటిసి కృష్ణారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, సుభాష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ పట్నం తానేష, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, రుక్మాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు మైలారం రామచంద్రం, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన వెంకటరామిరెడ్డి



నవతెలంగాణ-చేగుంట

మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకటరామిరెడ్డి నామినేషన్‌కు బైక్ ర్యాలీతో బయలుదేరిన చేగుంట మండలం బి కొండాపూర్ గ్రామానికి చెందిన యేసు, స్వామీలు తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి, స్థానికులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లతో మాట్లాడి వారికి మెరుగైన వైద్యం అందించాలని యశోద ఆసుపత్రి డాక్టర్లను కోరారు. వారి కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చేగుంట, నర్సింగ్ మండలాల అధ్యక్షులు కోమండ్ల నారాయణరెడ్డి, మైలారం బాబు, జిల్లా సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, నర్సాపూర్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, శ్యామ్ రావు, ఏఎంసీ చైర్మన్ కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ తానిషా, నాయకులు సుభాష్ రెడ్డి, భిక్షి రమేష్, మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ నుంచి డాక్టరేటు పొందిన జిల్లా వాసి భూపాల్





నవతెలంగాణ-నిజాంపేట

ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం విభాగంలో మండల సనిధి లెపి నార్లాపూర్‌కు చెందిన బత్తుల భూపాల్ రాజా రామ్ డాక్టరేట్ పొందారు. 'రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్ అండ్ ఇట్స్ ఇంప్లిమెంటేషన్ అంశంలో డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీ లో రాజనీతి శాస్త్రం విభాగంలో డా. ఎం రమణ ఆధ్వర్యంలో రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్ అండ్ ఇట్స్ ఇంప్లిమెంటేషన్‌లో పరిశోధనా చేసి పీహెచ్. డి పట్టా పూర్తి చేశారు. డిగ్రీ సిద్దిపేట లో బి ఎడ్ ఉస్మానియా యూనివర్సిటీ లో ప్రథమ విభాగంలో పాస్ అయ్యానన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైనా పాత్ర పోషించానన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు పరిశోధాకా విద్యార్థులు, పీజీ విద్యార్థులు ప్రముఖ విద్యా వంతులు ఎం ఎల్ ఏ లు,మినిస్టర్ లు, పాలక మండలి,ప్రస్తుతం పనిచేస్తున్న గవర్నమెంట్ సిటీ కాలేజీ అధ్యాపకులు ఫ్రెండ్స్‌గా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వర్షాలతో ఆగమౌతున్న అన్నదాతలులి
అవసరం ఉన్నప్పుడు
రాని ఈ వర్షాలు
పంటలు పండి చేతికి వచ్చే సమయాన
రైతుల నోట్లో మట్టికొడుతున్నాయి
పొలాన్ని దున్నే సమయాన
ఆకాశం వంక చూసి
ఒక్కసారి అయినా కనికరించక పోదా
అని అన్నదాతల ఎదురుచూపులు చూస్తూ
ఎన్నో తిప్పలు పడి
భూమిని తడి చేసుకుని
తనపని ఏదో తాను చేసుకు పోతుంటే
అప్పుడు ఎందుకు కనికరించవు
ఎవరో అడ్డుకున్నట్లు అలాగే వుంటావు
రాక రాక వచ్చి
మూడు నాలుగు నెలలు కష్టపడ్డ
కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందే
ఇది నీకు న్యాయమా,
రైతు పంటకు రోగం వచ్చింది అని
ఆమందు ఈమందు
అంటూ కొట్టని మందు లేదు
అదేంటో గాని ఆమందులు
పంటమీద కంటే మంచిగా రైతుల మీద పనిచేస్తుంది.
అయినా రైతులు గుండె నిబ్బరం చేసుకొని
ఊపిరి వున్నంత వరకు వ్యవసాయం చేస్తాడు
అదే ధైర్యంతో ముందుకు నడుస్తాడు...
కానీ వరుణదేవా.....
తీరా పంట మరో వారం రోజుల్లో చేతికి వచ్చే
సమయంలో ఎవరో చెప్పినట్లుగా
అకాల వర్షాలతో కుంభ వృష్టి సృష్టిస్తావు
పంటలు కొట్టుకుపోయి
పంట నష్టం కలుగుతుంది
రైతులకు కంటనీరు మిగిలింది
రెక్కలమీద కష్టపడి చెమటను చిందించి
పంటను పండించిన శోకమే చివరకు మిగిలింది
రోడ్లమీద ధాన్యాలు ఏరులై పారుతోంది
రైతులను ఆదుకుంటాం అని
ప్రభుత్వాలు పేరుకు మాత్రమే హామీలిచ్చి
కనుమరుగు అవుతున్నారు
దీనివల్ల పెట్టుబడి పెట్టిన రైతుకు
ఆత్మహత్యే మిగిలింది
ఒక రైతు ఏడిస్తే
అది యావత్ ప్రపంచానికి సిగ్గుచేటు
వర్షాలు వల్ల పంట చేతికి
రాకుండా తుడుచు పెట్టుకుపోతే
ఎవరికైనా ఎనలేని శోకాలు మిగులుతాయి
ఎన్ని ఇండ్లలో మరణ మృదంగాలు మోగుతాయి
ఇకనైనా రైతులకు అండగా నిలుద్దాం
రైతే రాజు అని అంటారు కదా
ఆ రోజులు ఎప్పుడు వస్తాయో అని
కనులు కాయలు కాచి వేచి చూస్తున్న.



- కస్తుబోయిన స్వామి
9502473946
గ్రామం: కొంగోడ్
మండలం: కొల్చారం

నర్సారెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక



నవతెలంగాణ - కొండపాక

కొండపాక మండలం మర్పడ గ్రామానికి చెందిన పలువురు నేతలు డిసిసి అధ్యక్షుడు తుంకుంట నర్సారెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు లచ్చపేట భాస్కర్ , మాజీ పి ఏ సి ఎస్ డైరెక్టర్ బక్కి నర్సింలు, బాల్ నర్సు, రవి, గఫూర్ తోపాటు 20 మంది కాంగ్రెస్ పార్టీ లో చేరారు, కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు లింగారావు, జిల్లా ప్రధానకార్యదర్శి అనంతుల నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ భాస్కర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, కనకరములు, మార్పడ్గ అధ్యక్షుడు శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రవీందర్ రెడ్డి, బాబు , కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు సన్నద్ధం కావాలి

- హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బిఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు బూత్ కమిటీ సభ్యులు సన్నద్ధం కావాలని హుస్నాబాద్ ఎంపీపీ లకావత మానస అన్నారు. గురువారం హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డ, వంగరామయ్యపల్లి, మిర్జాపూర్, బల్లునాయక్ తండ, పోతారం గ్రామాలలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షులు గంగం మధుమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనుమల ప్రభాకర్ రెడ్డి , పోతారం ఎంపిటిసి బొమ్మ గాని శ్రీనివాస్ , టిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు వంగ వెంకటరామిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, రవి, జిల్లెల్లగడ్డ మాజీ సర్పంచులు లావడ్యా స్వరూప, లావుడియా తిరుపతి , కొండల్, పొన్నబోయిన శ్రీనివాస్, పెసర శీను, లతా, రాజు , బాలు, రమేష్ ,శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మదిపూర్లో మలేరియా దినోత్సవం ర్యాలీ



నవతెలంగాణ- గజ్వేల్

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి అందిపూర్‌లో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణయ్ రాజు మాట్లాడుతూ మలేరియా రాకుండా ఉండడానికి తగిన జాగ్రత్తలు సూచనలు తెలియజేశారు. నీరు నిలవకుండా చూడాలని దోమతెరలను వాడుకోవాలని ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని నీరు ఎక్కడ నిలవకుండా చూడాలని ప్రతి ఫ్రైడే డ్రై డే గా ప్రజలు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పైకప్పులపై కొబ్బరి చిప్పలు గాని ఎలాంటి డబ్బాలు గాని ఉంచరాదన్నారు. గ్రామ ప్రజలు, పిహెచ్సి స్టాఫ్ అందరూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలి



నవతెలంగాణ -దుబ్బాక

ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించాలని కౌన్సిలర్లు ఆస యాదగిరి, బట్టు యాదమ్మ, ఎల్లం అన్నారు. గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 14 వ వార్డులో బట్టు రాజు నూతనంగా ఏర్పాటు చేసిన నాగార్జున మిల్క్ పార్లర్ కేంద్రాన్ని కంపెనీ ప్రతినిధులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూమిరెడ్డి, అధికం బాలకిషన్ గౌడ్, మల్లేశం గౌడ్, నాగార్జున మిల్క్ సీఈవో కృష్ణ ప్రసాద్, ఎస్ఎం శివకుమార్, ఏఎస్ ఎం విజయ్, పలువురు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి ప్రతిభ



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఒకేషనల్ కోర్స్ (ఈటీ గ్రూపు) విద్యార్థి డీ.సుకుమార్ 994 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈటీ గ్రూపు అధ్యాపకుడు తిరుపతిరెడ్డి సహకారంతో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా తమ విద్యార్థి సుకుమార్ 994 మార్కులను సాధించగలిగాడని ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనారాయణ చెప్పారు. ప్రభుత్వ కళాశాల ఖ్యాతిని పెంచేలా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన సుకుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు.

సాయిరెడ్డి రాంరెడ్డి అద్వర్యంలో సిద్దిపేట సభకు హాజరు



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన బహిరంగ సభకు మర్కుక్ బిజెపి మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి అద్వర్యంలో బిజెపి శ్రేణులు బారీగా తరలారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ లో రఘునంద్ రావు విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సింగం సత్తయ్య,బిజెపి ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, కొమురయ్య ,శ్రీనివాస్ ,బూత్ అధ్యక్షులు , శక్తి కేంద్ర ఇంచార్జీలు, బిజెపి నాయకులు, తదితరులున్నారు.

నేత్రపర్వం..నరసింహుడి రథోత్సవం

- 29న చక్రతీర్థం..



నవతెలంగాణ-బెజ్జంకి

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం గురువారం భక్తుల దివిటీలు,మొక్కులతో నేత్రపర్వంగా సాగింది. జెడ్పీటీసీ కడగండ్ల కవిత దంపతులు రథోత్సవానికి హజరై ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. బ్రహ్మోత్సాల్లో భాగంగా చక్రతీర్థం 29న ఉ.6 గం.లకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ తెలిపారు.ప్రత్యేక అర్చనలు,తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని ఈఓ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు గ్రామానికి చెందిన నిరుపేద దేవులపల్లి లలిత- నరసయ్య కూతురు లలిత వివాహానికి న్యాయవాది మంగు హరి హర రావు, డాక్టర్ మంగు ఫణి రాజ్ ఒక క్వింటాల్ బియ్యం అందజేశారు.అడగ గానే స్పందించిన మంగు వారి సోదరులను కుటుంబస్తులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పీసు నర్సింలు ముదిరాజ్, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సారెడ్డికి దేవాలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ ఎల్లమ్మ దేవాలయం పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయ ఉత్సవాల్లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహాదేవ్, కొండపాక మండల కాంగ్రెస్ మండల అధ్యక్షులు వాసవి లింగారావు , మాజీ కొండపాక మండల ఎంపీపీ అనంతుల పద్మా నరేందర్ , ముదిరాజ్ సంఘం కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ కోసం తరలిన నాయకులు



నవతెలంగాణ-కొండపాక

మెదక్ పార్లమెంటు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనడానికి కొండపాక మండలం నుంచి బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు భారీగా తరలి వెళ్లారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు నుంచి పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ ఆధ్వర్యంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ జాగృతి నాయకులు అనంతల ప్రశాంత్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు రాగల దుర్గయ్య లతోపాటు పలువురు మాజీ సర్పంచులు నాయకులు తరలి వెళ్లారు.

మలేరియా అంతం అందరి పంతం

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్
- నాసరపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



నవతెలంగాణ - సిద్దిపేట

మలేరియా అంతం మనందరి పంతం అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా నాసరపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాదిగా మలేరియా మానవాళిని పట్టి పీడిస్తూనే ఉందని, కానీ మనదేశంలో మలేరియా కేసులు, మరణాల సంఖ్య రోజుకు రోజుకు, తగ్గుముఖం పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ రిపోర్టుల ద్వారా తెలుస్తుందన్నారు. మలేరియా వ్యాధి ఫిమేల్ ఆనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుందని, ఏ డీస్ దోమ ద్వారా డెంగ్యూ ,చికెన్ గున్యా, క్యూలెక్స్ దోమ ద్వారా బోధకాలు మెదడువాపు, మాన్ సోనియా దోమ ద్వారా బోధకాలు వ్యాధులు వస్తాయని తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చు అని, అందుకు క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మలేరియా నిర్మూలన కార్యక్రమాల పైన ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మలేరియా రహిత సిద్దిపేట జిల్లాగా మార్చవచ్చని అన్నారు. మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ్ నాయక్ మలేరియా నిర్మూలనలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల పైన, సాధించిన ప్రగతి పైన నివేదికను వినిపించారు. అంతకు ముందు జిల్లా వైద్యాధికారి నాసర్ పుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని, అనంతరం ఫార్మసీ స్టోర్ మరియు ల్యాబ్ లో పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్, గాలి రమేష్, నవీన్, రాజ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామ అభివృద్ధి

- కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షులు గరిపల్లి రాములు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రూరల్ మండలం అధ్యక్షులు గరిపల్లి రాములు అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రఘువాపూర్ గ్రామంలో ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు గ్యార రఘుపతి మహారాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పిట్ల వెంకటి, ఉపాధ్యక్షులుగా గ్యార బాబు, ప్రధాన కార్యదర్శిగా తాడేపు లింగం, కార్యదర్శులుగా రామచంద్రం, శ్రీనివాస్, సలహాదారులుగా కనకయ్య, మురళి, సభ్యులుగా రాజయ్య, చంద్రయ్య, బాలరాజ్, యాదయ్య ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గరిపల్లి రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల అభివృద్ధికి పాటుపడుతుందని అన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంద పండు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదరి బండి శివకుమార్, సంయోద్దీన్, పుల్లూరు బండ చైర్మన్ కనకయ్య,సంపంగి బుగ్గరాజు, మహేష్, శేఖర్, లింగం, కనకరెడ్డి, స్వామి, శ్రీరాములు, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు..

పార్టీలో కష్టపడ్డవారికి ఎప్పటికి గుర్తింపు ఉంటుంది

- సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ-వర్గల్

కొత్త పాత అనే తేడా లేకుండా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కలిపిస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గురువారం వర్గల్ మండలం ఆనంతగిరిపల్లి గ్రామంలో ఎలక్షన్ రెడ్డి, గజ్వేల్ నియోజక వర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డితో కలిసి గ్రామంలో చేరికల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీసర్పంచి అప్పిడి సునీత, మాజీ ఉపసర్పంచ్ బండ్ల కనకరాజు యాదవ్, పాక్స్ మాజీ చైర్మన్ మల్లయ్య, వార్డు సభ్యులు రాజు, ఆంజనేయులు సహా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరగా నర్సారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వర్గల్ మండలం అన్ని రంగాలలో ముందుండేలా చొరవ తీసుకుంటానని ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పనిచేయాలని చెప్పారు. ప్రజా సంక్షేమం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కష్టపడి పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సతీష్, గ్రామస్థులు కిషన్, శంకర్, అంజయ్య, యువకులు రవి, యాదగిరి, నర్సింలు, వెంకటేష్, శ్రీనివాస్, నరేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కే పట్టం

- బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారని హుస్నాబాద్ బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాకాల శ్యాంసుందర్ గౌడ్ అన్నారు. గురువారం హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేండ్లలో బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యమని, వినోద్ కుమార్ ఎంపీగా కరీంనగర్ రైల్వే లైన్, మెడికల్ కాలేజ్, నేషనల్ హైవే ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కరీంనగర్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా వినోద్ కుమార్ గెలుపు ఖాయమన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ చేసిన అభివద్ధి పనులే నేడు గ్రామాల్లో కనబడుతున్నాయని వివరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం క్వింటాల్‌కు రూ 500 బోనస్, మహిళలకు నెలకు రూ 2500 అందించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శంకర్ , రైతు సంఘం నాయకులు దేవస్థానం శ్రీనివాస్ రెడ్డి ,పాకాల శ్యామ్ సుందర్ గౌడ్, లక్ష్మణ్ ,సునీత ,లక్ష్మి గజవెల్లి రాములు కురుమేలి చంద్రయ్య పాల్గొన్నారు.

నయవంచనకు పర్యాయపదం కాంగ్రెస్ : రఘునందన్‌రావు





నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి, 4వేల పింఛన్ ఇస్తానని ప్రజల ద్వారా ఓట్లు వేయించుకొని రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని, నయవంచనకు పర్యాయపదంగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని మెదక్ బిజెపి ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్ర మంత్రి వర్గంలోకి ముదిరాజ్ లను తీసుకుంటానని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు నుంచి గెలిచిన ముదిరాజ్ ఎమ్మెల్యేను ఎందుకు మంత్రి వర్గంలోకి తీసుకోలేదన్నారు. బీజేపీని ఓడించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావులు విమానంలో కుట్రలు పన్నారన్నారు. వెంకట్రామిరెడ్డి కెసిఆర్ కాళ్లు మొక్కి, కలెక్టర్ పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ అయ్యారని అన్నారు.

అన్ని సామాజిక వర్గాలకు కాంగ్రెస్ పెద్దపీట



- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో గౌడ సంఘం నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని సామాజిక వర్గాలకు సబ్సిడీ రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని సామాజిక వర్గాలకు కావలసిన సంక్షేమ పథకాలను అదేవిధంగా ఆర్థికంగా రాజకీయంగా ప్రోత్సహిస్తుందన్నారు. గౌడ సంఘంకు చెందిన రాజా గౌడ్, మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, గాడి పల్లి భాస్కర్, మల్లారెడ్డి, నక్క రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోలిపేట కుటుంబాన్ని రాజకీయంగా భూస్థాపితం చేయడమే కేపీఆర్ లక్ష్యం

- కాల్వ నరేష్



నవతెలంగాణ-దుబ్బాక

నియోజకవర్గంలో సోలిపేట రామలింగారెడ్డి అనుచరులను పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ పార్టీ వీడేలా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పొమ్మనలేక పొగబెడుతున్నారని, సోలిపేట కుటుంబాన్ని రాజకీయంగా భూస్థాపితం చేయడమే లక్ష్యంగా కొత్త ప్రభాకర్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కాల్వ నరేష్ ఆరోపించారు. ఏళ్ల తరబడి బీఆర్ఎస్ లో పనిచేస్తున్న సోలిపేట వర్గీయులను కాదని ఇతర పార్టీల నుంచి కొత్తగా వచ్చిన వారికే ఇన్చార్జ్ బాధ్యతలు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. గురువారం దుబ్బాకలో మీడియాతో ఆయన మాట్లాడారు. 2020 దుబ్బాక ఉప ఎన్నికల్లో రామలింగారెడ్డి సతీమణి సుజాత ఓటమికి కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రధాన భూమిక పోషించారన్నారు. దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రామలింగారెడ్డి వర్గం ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకుల్ని టార్గెట్ చేసి వారంతట వారే బీఆర్ఎస్ ను వీడేలా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వ్యూహరచన చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తన వైఖరిని మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

కేసీఆర్ సెంటిమెంట్ ఆలయంలో ప్రత్యేక పూజలు

- కరీంనగర్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా
- కరీంనగర్ నామినేషన్ వేసిన బీసీ సెల్ నాయకుడు పిడిశెట్టి రాజు



నవతెలంగాణ-నంగునూరు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సెంటిమెంట్ ఆలయమైన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన బీసీ సెల్ జిల్లా నాయకులు పిడిశెట్టి రాజు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రతి పుట్టినరోజును పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో హుస్నాబాద్ నుండి వేములవాడ, కొండగట్టు, యాదగిరి గుట్ట వరకు , అదేవిధంగా తిరు మల తిరుపతి దేవస్థానం వరకు సైకిల్ యాత్ర చేశానని చెప్పారు. కేసీఆర్ అంటే తనకు ఇష్టమని నాకు ఎంపీ టికెట్ ఇవ్వకపోవడం చాలా ఆవేదనకు గురి చేసింద న్నారు. గులాబీ పార్టీకీ తాను కూడా ఓనర్ నని, గత పదేళ్లలో కేసీఆర్ భీ ఫామ్ మీద గెలిచినా వాళ్ళు నేడు పార్టీ మారి కేసీఆర్ ని విమర్శిస్తు న్నారని తెలిపారు. కేసీఆర్ తోనే తన ప్రయాణమని, వారి స్ఫూర్తితోనే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పారు.

పంచిన డబ్బులు ఇవ్వమన్నందుకే సస్పెండ్ చేశారు : వంగ బాల్‌రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

ఎన్నికల్లో పంచిన డబ్బులను ఇవ్వమన్నందుకే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తనపై కక్షగట్టి తనను అకారణంగా పార్టీ నుండి సస్పెండ్ చేశారనిబీఆర్ఎస్ నాయకులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు వంగ బాల్ రెడ్డి ఆరోపించారు. చెల్లాపూర్ 4 వ వార్డ్ లో ఎన్నికలను బాయ్ కాట్ చేస్తే ఓటుకు వెయ్యి రూపాయల చొప్పున తన దగ్గర ఉన్న డబ్బుల్ని ఓటర్లకు పంచమని, తనకు అకౌంట్ ద్వారా డబ్బులు పంపిస్తానని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తనతో చెప్పారని తెలిపారు. గురువారం దుబ్బాక పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ వార్డులో తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ పార్టీకి కొత్త ప్రభాకర్ రెడ్డి,తాను చేసిన సేవల్ని పార్టీ పెద్దలు గుర్తించాలని,పార్టీ కోసం కష్టపడే నాయకుల్ని పోగొట్టుకుంటే పార్టీ భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందన్నారు. పార్టీ పెద్దలు తనను ఎందుకు తొలగించారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తానన్నారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తన సత్తా ఏంటో చూపిస్తానని, బీఆర్ఎస్ కు ఒక్క ఓటు కూడా పడకుండా తన శాయశక్తులా ప్రయత్నిస్తానని హెచ్చరించారు.

ప్రగతి కాలేజీలో ఉత్తమ ఫలితాలు



నవతెలంగాణ-గజ్వేల్: గజ్వేల్ పట్టణంలో ప్రగతి జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఇంటర్, మొదటి రెండవ సంవత్సరం సంబంధించిన ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ అంబదాస్, ప్రిన్సిపాల్ మట్టయ్య తెలిపారు, గురువారం వారు మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూపులో అఖిల 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించి కళాశాల టాపర్గా నిలిచినట్లు వారు చెప్పారు. అదేవిధంగా సుప్రియ ఎంఎల్‌టి 480, డి పూజ సిఎస్ 464, నితిన్ ఈటి 437, కీర్తన, పీహెచ్ టి 428 మార్కులు సాధించినట్టు వారు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీడబ్ల్యూహెచ్ గ్రూపులో శ్రావణి 1000 మార్కుల గాను 950 మార్కులు సాధించి కళాశాల టాపర్ గా నిలిచిందన్నారు. కుమార్ పీహెచ్. టీ.948, పూజ సిఎస్ 941, హనుమంతు ఎం ఎల్ టి.940, వంశీ ఈ టి 884, అక్షయ ఏసిపి 879 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, మహేష్, నాగేందర్, హరీష్, భిక్షపతి, కృష్ణ, అనిల్, ప్రభాకర్, నరేందర్, కల్పన, స్పందన, కమలాకర్ లు విద్యార్థులను అభినందించారు.

అందరి కృషితో భారీ మెజార్టీ సాధించాలి

- మెదక్ పార్లమెంట్ బిఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలుపు ఖాయమని మెదక్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం నామినేషన్ వేసేందుకు వెళ్లే ముందు గజ్వేల్లో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కృషితో మెదక్ పార్లమెంటులో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు నాయకులు ఈ నెల రోజులపాటు కష్టపడాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి పార్టీకి క్యాడర్ లేదని ఆయన అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో భారీ మెజార్టీ తీసుకురావాలని ఆయన సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బిజెపి నాయకులు



నవతెలంగాణ-జగదేవపూర్: జగదేవపూర్ మండలం పరిధిలోని బిజెపి పార్టీ మండల నాయకులకు గురువారం నాడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంటా నర్సిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగదేవపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్ రెడ్డి, ఫాక్స్ మాజీ చైర్మన్, నరేందర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు రాగుల రాజు ముదిరాజ్ ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నర్ర స్వామి, హేమ సురేష్, కిషన్, శ్రీనివాస్‌తో పాటు మరికొంతమంది నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే నమ్మకం కలిగిన పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ , బిజెపి పార్టీలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే ప్రభుత్వమని రాబోయే ఎంపీ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధు ముదిరాజ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో, జగదేవపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంత రెడ్డి మాజీ సర్పంచ్ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అజీస్ తదితరులు ఉన్నారు.